కథానిక

# ఉద్యోగపర్వం

క్షేమేంద్ర

"చదువు పూర్తయిపోయిందనుకుంటా కదూ? ఏం చేస్తున్నావు?" ఏం ప్రశ్న! ఎవరి నాలిక మీదగాని ఎదురయ్యే మొదటి ప్రశ్న. ఒకటోరకం చచ్చుప్రశ్న. నిజం చెప్పాలంటే ఏంచేస్తున్నాను? ముప్పూటలా మూడుకంచాలు చెల్లిస్తున్నాను; కుండల్లో గుర్రాలు తోలుతున్నాను; తీరిగ్గాకూచుని గోళ్లుగిల్లుకుంటున్నాను పచ్చగడ్డి పెరగడాన్ని పరిశీలిస్తున్నాను.

అడిగినవాళ్లెదురుచూసే జవాబుల జాబితాలో పైనచెప్పినవేవీ కనపడవ్. అందుకని ఆ మాటలంటే హాస్యరసంపోషలుగల కొద్దిమంది అర్థమైందిలే అన్నట్టు నవ్వుతారు; కొందరు వీణ్ణి అడిగినంత బుద్ధితక్కువలేదని లోపల్లోపలనే పుష్కలంగా తిట్టుకుని చెంపలు గాట్టిగా వాయించుకుంటారు. చాలామంది సాపుగా ఎలక్ట్రిక్ షాకు తిన్నట్లు చలిస్తారు. ఇంకొందరు వీడికేమా మతి సరిగ్గా వ్యవహరిస్తున్న సూచనలు లేవని జంకుగా త్వరగా తప్పుకుని తరవాత తెలిసినవాళ్ళతో చెప్పుకుంటారు, "వాడున్నాడే ఫలానా? వాడేమన్నాడనుకున్నావేంచేస్తున్నావని అడిగితే? పచ్చగడ్డి పెరగడాన్ని పరిశీలిస్తున్నాట! ఆలోచించు, పచ్చగడ్డి! తెలివైనవాడే; పాపం ఆర్నెల్లాయి డిగ్రీపుచ్చుకుని, ఉద్యోగం లేకపోయె? మనస్సు స్థిమితం తప్పిందని నా అనుమానం" సీరియస్‌గా మొహంపెట్టి.

ఏంచేస్తున్నావని అడిగినంత తేలికేదీలేదు. ఏమన్నా చేస్తూవుంటే ఫలానిది చేస్తున్నానని చెప్పినంత తేలికాలేదు. సమాధానంచెప్పే చిక్కు ఎటొచ్చీ ముంగిలా ఇంట్లో కూచుంటేనే. ఏం చెయ్యటంలేదని అడిగిన వాళ్ళందరికీ (వీళ్లుచాలామంది) చెప్పాలిసి రావడం మనకే రుచించని విషయం. ఎందుకంటే వెనకచెప్పినట్టు కుండపగలేసి మాట్లాడితే నరాలు జివ్వుమన్న నరమానవులంతా మెత్తగా నీళ్ళునములుతూ ఏంచెయ్యటంలేదని చప్పగా చెప్పినప్పుడు, "ఛా! ఏంచెయ్యకుండా ఎలా ఉండగలవింతచచ్చుగా?" అన్నట్టు ముఖం తేలేసి నొసలూ పెదవీ ఒక్కమారే విరిచి "వీడితో ఇంకా మాట్లాడేదేమిటిలెద్దూ?" అని ఒక్కమోపున అదే పోక.

రామ్మూర్తి ఇంగ్లీషు సారస్వతంలో ఎమ్మే పాసయి ఎనిమిదినెలలు అవస్తోంది. అతను ఎదటివాళ్ళ ఎబ్బెట్టులికి ఏమాత్రం జంకని మనిషి. కొత్తగా చాలాకాలేజీలు తెరిచారు. ఇంగ్లీషులో ఉపన్యాసకులు కావాలన్నారు; కావలసినంత మందినీ తీసుకున్నారుకూడా. కాని రామ్మూర్తి మట్టుకు ఇంకా ఊరిలో ఎరిగున్నవాళ్ళందరికీ ఆశ్చర్యంగా ఆఫీసులన్నీ పనిచేసేవేళల అప్పుడప్పుడు వీధుల్లోనూ, నిత్యం తప్పకుండా సాయంత్రం పార్కుల్లో పచ్చగడ్డిమీదా కనిపిస్తూనే వున్నాడు. ఏంచేస్తున్నావని కొత్తలో వచ్చినంత తరచుగా కుశలప్రశ్నలు కురవడం లేదతనిమీదిప్పుడు. రోజూ చచ్చేవాడి,కెవళ్ళేడుస్తారని సామెత ఉండనేవుంది.

కాలం కర్మం కలిసిరావాలి ఉద్యోగానికి అన్నారు కొందరు పెద్దలు. నేననేది కాలం కర్మం కలిసొచ్చినా కలిసిరానిబాపతు రామ్మూర్తి అని. మిత్రమండలిమాత్రం ఇతని వ్యవహారం ఏమీ తృప్తికరంగాలేదని నిక్కచ్చిగా నిర్ణయించేసింది. కాకపోతే మరేమిటి? "ఇదుగోనోయ్, ఫలానాఊళ్ళో కొత్త కళాశాల ఒకటి వెలుస్తోంది, ఓ దరఖాస్తు పడెయ్యకూడదూ లెక్చరర్ పోస్టుకి?" అని ఏ మిత్రుడన్నా ఉబికేస్నేహంకొద్దీ ఉచిత సలహాయిస్తే మర్యాదగా కృతజ్ఞత వెలిబుచ్చేవాడు. దరఖాస్తు పడేసిందీ లేనిదీ దేవుడికెరుక. దేనికీ ప్రయత్నించలేదనే నా నమ్మకం. అవే ఉద్యోగాల్లోకి అతనికన్న తక్కువ అర్హతలున్న వాళ్ళని తీసుకోడం నే నెరుగుదును. స్నేహితులు ఈ విషయంలో ఏం చెప్పీ లాభంలేదని వొదిలేశారు. తాడిచెట్టెక్కేవాణ్ణి ఎందాకానని పైకి తోస్తారు? అందులో ఎక్కాలని ఏమంత ఉబ-

లాటం లేనివాణ్ణి, ఎక్కడో అని ఈడిగిలబడే వాణ్ణి!

ఏం ఉద్యోగం లేకుండా తీరికూచున్నప్పుడు బయట సొద్దువేసే పెద్దమనుష్యులమాట అటుంచి సొంత ఇంట్లోనే మనిషి పరపతిరేఖాపటంగాని గీసినట్లయితే ఆ నెలకానెల మాంచినిట్రంగా దిగి పోతుంది కింకికి. రామ్మూర్తికీసంగతి తెలియదను కోడంపొరబాటు, అతనికి బాగాతెలుసు. అయితే ఆదేపరిస్థితుల్లోవున్న తదితరులకీ అతనికీ ఓ ముఖ్య మైన తేడావుంది. అదతనికి ప్రయోజకరకారని కూడా చెప్పాలి. రామ్మూర్తి ఒక్కగానొక్క కొడుకు తన తల్లిదండ్రులికి.

ఒక్కకొడుకు, నిజమే. కాని ఎంతకాలమని చూస్తూ ఊరుకుంటారు? ఏ ప్రయత్నమూ చెయ్యక, మీనకట్టినపాటి లెక్కన్నా లేకుండా ఇంటికాపలి కాస్తూన్న కొడుకు సంగతేమీ అంతు చిక్కలేదు. రామ్మూర్తి తండ్రికి. చివరి కుండబట్టలేక అనేశాడో రోజున, "నువ్వు ఉద్యోగం చేస్తూంటే చూసి ఆనందించేరాత లేదా మా మొహాలమీద" అని.

"అదనే నా నమ్మకం"...చాలా తేల్చిగ్గా తేల్చేశాడు రామ్మూర్తి.

తండ్రి నిర్ఘాంతపోయాడు లోకంలో ఎక్కడన్నా వుందా ఇలాంటి విపరీతం? ఎవళ్లుగాని చదువుపూర్తవగానే పరీక్షల్లో నెగ్గినా నీలిగినా కనపడ్డవాడి కాళ్ళల్లా పట్టుకుని నానాకూళ్ళు కుడిచి వచ్చి చెడి సాధించబోతారే ఉద్యోగం! వీడికేమయింది, ఇలా బెడిసి భీష్మించుకు కూచో డానికి?

"ఇదుగో, ఎమ్మే పరీక్షయావు. నీ కింకొకళ్ళు చెప్పాల్సిన వయస్సుకాదు. అవసరమూలేదు. నాతోచెప్పు, ఎందుకనీ ఉద్యోగం చెయ్యదల్చుకో లేదు!"

"నా పరిస్థితుల్లో వున్నవాడికి ఉద్యోగం చెయ్యడం అవసరమని నేననుకోను. ఇప్పుడు జరుగుబాటు కావడంలేదూ?"

"అలాగా? ఇంత చిన్నవిషయం తెలియని వాడివనుకోలేదు. కూచుని తింటుంటే కొండలు కూడా కరిగిపోతయ్." రామ్మూర్తి "అవునా?" అన్నట్టు ఆశ్చర్యం అభినయించి తనకి కొండల్ని కరిగించటమంటే చాలా సరదా అని తెలియ జేశాడు.

"సరే, మాకు కడుపు నిండిపోయిందికాని, సుమతీశతకం చదువుకున్నావుగా- గడనుడుగు మగనిమూచిన- నీ పెళ్ళాం..."

రామ్మూర్తి తల్లి అడ్డుపడ్డది, "ఎందుకొచ్చిన వాదన. ఆలూలేదు, చూలూలేదు; పెళ్ళామూ పిల్లలూను. ఎవరేమనుకుంటేనేం? మన పిల్లాడు మనకు చేదుకాదుగా?"

ఈ తాకిడికి తట్టుకోలేక "నీ మొహం" అన్నట్టు పెళ్ళాంవేపు ముఖం చిట్లించి రామ్మూర్తి తండ్రి వేగంగా వీధిలోకి జారుకున్నాడు. రామ్మూర్తి మటుకు తల్లివేపు మెప్పుగా, సాలోచనగా చూశాడు.

* * *

ఎక్కడో ఢిల్లీలో ఉద్యోగం చేస్తూన్న రామ్మూర్తి మేనమామ దిగాడు, రెండు నెల్లు సెలవుపెట్టి పనిలోపనిగా అక్కగారిని చూద్దా మని రామ్మూర్తితండ్రి అవకాశంఅందుకున్నాడు. అయనకి ఈ రాకలో ఒకటే సుగుణం కనబడ్డది. తనతో ఉద్యోగం సంగతిగురించి మాట్లాడటానికి జంకికాని అయిష్టంవల్లకాని రామ్మూర్తి నిజంగా తన మనస్సువిప్పి చెప్పక పోతే ఆ రహస్యం ఏమిటో, అసలేమన్నా ఉంటే మాట, మామయ్య బయటికి లాక్కురాగలడు. ఇన్నాళ్ళనించీ తన గుండెలో ఎక్కడో కెలుకు తూన్న ఈ విషయం, తన కొడుకు ఇంత పనికి మాలినతనం తెలివితక్కువా ఒక్క ఉద్యోగం ప్రస్తావనొచ్చినప్పుడు మాత్రం ఎందుకు కనబరు స్తున్నాడో సరిగ్గా తేల్చుకుంటే తప్ప తనకి నిద్దరపట్టదు. తను ఓడిపోయినచోట మామయ్య ఉపాయం రామ్మూర్తికి మామయ్యంటే ఉన్న గౌరవం నెగ్గుకురావచ్చు. ఈ ఉద్దేశంతోనే ఒకరోజు బావమరిదిదగ్గర తన అవస్థంతా వెళ్ళ బోసుకుని కొడుకు బుర్రకెపట్టిన అనారోగ్యకర మైన అభిప్రాయాలేమన్నా ఉంటే కుదిర్చి తీరా లని నోరుచేసుకు అడిగాడు కూడా. "నీకెందుకు బావా, నేకనుక్కుంటాగా. వాడు తెలివైన వాడే. ఏదో కారణంలేకుండా ఇలా మొరాయిం చడు. రేపెల్లుండిలో వాణ్ణి కదలేసి అసలుసంగ

తేమిటో తెలుసుకుంటాను. అయితే ఈలోపుగా మాత్రం నేనేదో అద్భుతం చేస్తాననీ ఎల్లుండి నించీ వాడు పత్రికలకోసం పరుగెత్తుతాడని మాత్రం అనుకోవద్దు" అన్నాడా విద్వాంసుడు. రామ్మూర్తి తండ్రి సగం ఆశగా సగం అనుమానంగా మొహం పెట్టాడు.

సంశప్తకులు అర్జునుణ్ణి అటకాయించారు అన్నట్టుగానే మామయ్య రామ్మూర్తిని సాయంకాలం పార్కులో పట్టుకున్నాడు. మాటామాటామీద లాక్కొచ్చాడు, "ఏమోయ్, ఉద్యోగమేం చెయ్యనంటావుటేమిటి? నీపాటి అర్హతలుండీ ఊరికే కూర్చున్న వాళ్ళనీ కూర్చోగలిగిన వాళ్ళనీ నేనింతవరకు చూడలేదు" అని.

రామ్మూర్తి నవ్వాడు, "నీకు నువ్వు సమాధానంచెప్పుకోవేం? ఉద్యోగంలేకుండా ఊరికే కూర్చోగలిగాను కాబట్టే ఇలా వున్నాననుకోవచ్చుగా. ఊరికే కూర్చోగలిగి, అలా ఉండటం మూలాన్ని ఎవరికొచ్చిన అపాయం లేకపోగా పైపెచ్చు ఊరికే ఉండలేనివాళ్ళకి మేలుకలుగుతూంటే ఎందుకని ఉద్యోగంకోసం వెతుక్కోవాలి?"

"అంటే..." మామయ్య అంతగా అర్థంకానట్టు చూశాడు.

"అంటే..."అని దీర్ఘంతీశాడు రామ్మూర్తి; "ఉన్నవాళ్లు ఉద్యోగాలికెగబడాల్సిన అవసరం లేదనీ, అలా ఎగబడితే అది దొంగతనమేననీ. నీకు ఏవిధమైన ఆసరాలేక ఆకలికీ అన్నానికీ మధ్య ఉద్యోగం చెయ్యడం ఒక్కటే ఉపాయంగా తోస్తే సరి ముందుకుపో, ఎక్కడో అక్కడ ఏదో ఉద్యోగంకోసం తంటాలుపడు. అలా కాక లోకం మెప్పుకోసమైతే, నీ గౌరవం ఒక మెట్టు పైకి ఎక్కించడానికయితే వద్దు. ఇవాళ నన్ను లెక్చరర్‌గా తీసుకున్న కాలేజీలో నేను చేరకపోతే ఆ ఖాళీ, నాకోసమనే సృష్టించినదయితే తప్ప అలాగే ఉండదు. ఎవరో చదువుకున్నవాడే అవసరమై అందులో ఇరుకుతాడు. అతను ఎంత శ్రమపడి ఎన్ని అప్పులుచేసి చదువుకున్నాడో, ఈ ఒక్కఆధారంమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో ఎవరికి తెలుసు?"

"సరే, మంచిదే. కాని రేపు వాడు పాఠాలు సరిగా చెప్పకపోతే వాణ్ణి తీసెయ్యరా? నీ ఆశయాలికి బాగుపడిందెవరు? ఆ బీదవాడుమటుకు కాదు. మీదుమిక్కిలి తెలివైన లెక్చరర్ లేనందుకు చెడిపోయేది మన విద్యార్థులూ, ఎడ్యుకేషన్ సిష్టంకాదా?"

రామ్మూర్తి కొంచెం కరుగ్గా చూశాడు, "నీ ఉద్దేశంలో పేదవాళ్ళంతా ఉత్త బుద్ధిహీనులు. నేనలా అనుకోను"అన్నాడు.

"నన్ను సరిగా అర్థంచేసుకోలేదు నువ్వు. నేననేది ఎవరికి ఉద్యోగం జీవితావసరమో వాళ్ళలోంచే మనకు కావలసిన మనిషిని ఎంచుకోవాల్సి వస్తే మన ఛోయిస్ పరిమితమవుతోందని, దానిమూలాని నష్టమే ఎక్కువని. అదీకాక నువ్వేదో మొదటు దొంగతనమన్నావు. నిజంగా ఆలోచించు, ఏది దొంగతనం కాదు? నీకు పదెకరాలుండటం ఇంకొకడికి తలదాచుకునే పంచ కూడా లేకపోవడం మునుపు మీవాళ్ళల్లో ఎవరో చేసిన దొంగతనమో కాదా? ప్రౌఢన్ అన్నట్టు ఆస్తి అంతా దొంగసొమ్మే. నీ మాటల్నిపట్టి చూస్తే ఏం తేలుతుందంటే మీ పూర్వీకులు గడించిపెట్టిన సొమ్ము తింటూ కూర్చోడం తప్పు కాదు, అందులో ఏంపాపంలేదు; కాని ఉద్యోగం చేస్తేమాత్రం..." ఆయన మధ్యలోనే ఆగిపోయాడు, ఈ వాదనవేడిమిలో సరైన పంథా తొక్కానా అనిపించింది ఆయనకి, కథ అడ్డం తిరిగే సూచనలు కనిపిస్తూనే వున్నయ్. రామూర్తిని పరికిస్తే. ఆయన భయపడినంతా అయింది. మట్ట మధ్యాహ్నం. పిట్ట పిడుగు! రామ్మూర్తి నిష్కర్షగా అన్నాడు, "నువ్వు చెప్పింది నిజమే. ఏదో ఉద్యోగంచేసి పొట్టపోసుకోడంలోనే నిజాయితీ ఉంది. అందుకని రేపట్నించే ప్రయత్నిస్తా కూడాను. అయితే ఒక్క మాటుమాత్రం చెప్పనీ. నాకు మా పూర్వుల చౌర్యంలో దమ్మిడీకూడా వద్దు." అతని కళ్లు వింతగా వెలిగినయ్.

మామయ్య ఈ ఆదర్శవాదిని చూసి అబ్బురపడ్డాడు. ఇక ఏంచెప్పే ఉపయోగంలేదు. ఆయనకి మనస్సులో ఒక్కటే మెదిలింది తరవాత; "ఏమిటి నీ నిరవాకం"అని తనని నిరసిస్తూన్న బావగారి ముఖం!

★